క్లుప్తంగా

బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా గజానంద్



గజానంద్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు సోన్‌టాకే గజానంద్‌ను జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులుగా నియమించినట్లు బీజేపీ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి కదం బాబురావ్ తెలిపారు. సోన్‌టాకే గజానంద్‌ను ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆల్కే గణేష్, నానం రమణ, చట్ల ఉత్తం, ప్రసన్నరావ్, జాంసింగ్ పాల్గొన్నారు.

జామిడిలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేసిన మహిళలతో అధికారులు

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో గ్రామ సహకార సంఘం, గ్రోమోర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని రైతువేదిక భవనం వద్ద నిర్వహించి పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వివిధ రకాల ముగ్గులు వేశారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో రాంరెడ్డి, గ్రోమోర్ అధికారి నాగరాజు, గ్రామపెద్దలు గంగారెడ్డి, కేశవ్ రెడ్డి, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మొదటి రోజు దేవత ఆహ్వానము, అర్చన, హోమం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

సన్మానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రూరల్ మండలం బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన బంతిపెల్లి దయాకర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. నాయకులు పాయల్ శరత్, మయూర్ చంద్ర, కేమ శ్రీకాంత్, సాయి గౌడ్, చరణ్ గౌడ్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతి అందజేస్తున్న గండ్రత్ రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని, ఓటమి చెందిన జట్టు నిరాశ చెందవద్దని మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. గత పది రోజులుగా మండలంలోని ఖండాల గ్రామంలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు. తుమ్మగూడ గ్రామానికి చెందిన జట్టుకు మొదటి బహుమతి రూ. 18వేలు, రెండో బహుమతి ఇంద్రవెల్లి మండలం సమక జట్టుకు రూ. 12వేలు, మూడో బహుమతి ఖండాల గ్రామానికి చెందిన జట్టుకు రూ. 6వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, ప్రకాశ్, మోతిరాం, అంకుష్, బుచ్చన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలోని లాల్ పిచ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, చంటి, చట్ల ఉమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఘన్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కబడ్డీ ఆడారు.

సిరికొండ: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆది వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఓరగంటి పెంటన్న మాట్లాడుతూ.. యువకులు స్నేహపూర్వకంగా క్రికెట్ ఆడాలన్నారు. కార్యక్రమంలో తోకల చిన్న రాజన్న, గోర్బండ్ ప్రకాశ్, బషీర్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఫస్ట్‌స్టెప్ స్కూల్‌లో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న నాయకులు



సిరికొండలో..



తాంసి: బీజేపీ ఆధ్వర్యంలో..



బజార్‌హత్నూర్‌లో..

వివేకానందుడికి ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని, ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. దేశ భవిష్యత్ కోసం యువత ముందుకు రావాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. రిమ్స్ ఆవరణలోని వివేకానంద విగ్రహానికి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వివేకానంద చౌక్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న నివాళులర్పించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్‌టౌన్: పూలమాలలు వేస్తున్న నాయకులు



బేల: నివాళులర్పిస్తున్న మరాఠా నాయకులు



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న నాయకులు



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఆదిలాబాద్‌టౌన్: మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

నూతన కార్యవర్గం

ఎదులాపురం: అఖిలభారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డీవై) పట్టణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి కుంటాల రాములు తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన ఏఐఎ ఫ్‌డీవై సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు కమిటీ వివరాలను వెల్ల డించారు. అధ్యక్షుడిగా పుల్లూరి లింగన్న, ఉపా ధ్యక్షుడిగా కట్టర్ సాయి, ప్రధాన కార్యదర్శిగా గంగాసర్పువర్ హరీశ్, సహాయ కార్యదర్శిగా పుల్లూరి చందు, వాగాడే రాకేశ్, దేశ్‌ముఖ్ చరణ్ ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. దేవేందర్, శ్రీకాంత్, నరేందర్, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

108లో ప్రసవం

బజార్‌హత్నూర్: మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సోనేరావ్‌గూడ గ్రామంలో పూలవతికి ఆదివారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబసభ్యులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. పైలెట్ రాజారాం అంబులెన్స్‌ను పక్కకు నిలిపారు. ఈఎంటీ సురేశ్, ఈఆర్‌సీపీ డాక్టర్ స్మితను ఫోన్‌లో సంప్రదించి ఆమె సూచనలు మేరకు పురుడు పోశారు. పూలవతికి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లిబిడ్డకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించగా ఇద్దరు ఆరోగ్యకరంగా ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్ భీంరావ్ తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిరుపేదలకు రహేమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చలి తీవ్రత అధికంగా ఉండటంతో దుప్పట్ల పంపిణీ చేసినట్లు సభ్యులు పేర్కొన్నారు. విజయ్ రెడ్డి, సురేశ సులేమాన్, షేక్ సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అప్పారావ్

బజార్‌హత్నూర్: ప్రతీ వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై అప్పారావ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకు వెళ్లవద్దన్నారు. ప్రతీ వాహనదారుడు వాహనం రిజిస్ట్రేషన్ పేపర్, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం కలెక్టర్ చౌక్‌లోని ఆటో అడ్డా వద్ద డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు, చట్టాల గురించి వివరించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

లీమ్‌గూడకు భగీరథ నీరు సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: మండలంలోని లీమ్‌గూడ గ్రామానికి భగీరథ నీరు సరఫరా కాక గ్రామస్తులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. కాగా లీమ్‌గూడ గ్రామస్తుల తాగునీటి పడుతున్న అవస్థలపై కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. ఆదివారం ‘సాక్షి’ దినపత్రికలో ‘లీమ్‌గూడలో తాగునీటి కష్టాలు’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ సూపర్‌వైజర్ ప్రఫుల్ స్పందించారు. గ్రామానికి భగీరథ నీటిని సరఫరా చేసి ఇంటింటికీ నీటి సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టారు. భగీరథ నీరు సరఫరా కావడంతో గిరిజనులు ఆదివారం ఇంటి వద్ద ఉన్న నల్లాల వద్ద నీటిని పట్టుకున్నారు. నీటి కష్టాలు తప్పడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు.



భగీరథ నల్లా వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అలముకున్న చీకట్లను ప్రాలదోలడానికి, దేశ ప్రజలపై జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించే గొంతుకగా ప్రియాంక గాంధీ నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యుం, చంద్రయ్య, దూట రాజేశ్వర్, కలీం పాషా, ఇమ్రాన్, హైమద్, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

ఇచ్చోడ: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ కుటుంబాన్ని ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఆడే గజేందర్, కుంర కోటేశ్వర్, చౌహాన్ శేషరావు, ముస్తాఫా, అజీం సుల్తాన్, బత్తుల అశోక్ ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



భక్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొర్టికల్ గ్రామంలో గల భీమన్న ఆలయ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావనను కలిగి ఉండాలని సూచించారు. అంతకుముందు భీమన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, సాబ్లే ప్రతాప్ సింగ్, విజయ్, శ్రీనివాస్, గులాబ్ సింగ్ పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ మండలంలోని నాగమల్యాల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భీముడు కుమారుడు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రతీ గ్రామానికి తారురోడ్డు

ప్రతీ మారుమూల గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పట్‌పట్‌తండా గ్రామానికి నూతన బీటీరోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలతో భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటు వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

బజార్‌హత్నూర్: ఈనెల 7న దేగామ గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో గిర్నూర్ గ్రామానికి చెందిన ఆడెళ్ళ, ఆశన్న, అరుణ్‌లు మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆదివారం గిర్నూర్ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నేరడిగొండ: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కిషన్ రూపావత్ 38 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న మౌనిష్ రెడ్డి

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయానికి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి రూ.51 వేలు విరాళంగా అందించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు తనవంతుగా విరాళాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామపెద్దలు రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, గంగయ్య, మల్లారెడ్డి, నందయ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయానికి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి ఆదివారం రూ.41వేలు విరాళంగా అందజేశారు. విలాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామసుందర్, నరేశ్, గంగన్న, పవన్, రమేశ్, దౌలత్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన నల్ల దేవన్న ప్రమాదవశాత్తు కిందపడి కంటి చూపు కోల్పోయాడు. అంతేకాకుండా దివ్యాంగుడు కావడంతో విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లాడు. ఆయనకు రూ. 5వేల ఆర్థిక సాయం చేశాడు.

ఎస్సీ వర్గీకరణలో భాగస్వామ్యం కావాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ ధర్మ యుద్ధ పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఇండ్ల ఎల్లన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ శాంతినగర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దింటి సూర్యప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మల్యాల రవి, ప్రధాన కార్యదర్శిగా పసుల శ్రీనివాస్, కార్యదర్శిగా దాసరి రాజు, సంయుక్త కార్యదర్శిగా రొడ్డ రవి, ప్రచార కార్యదర్శిలుగా రొడ్డ రమేశ్, తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా నాయకులు గుర్రాల ఆశన్న, పట్టణ ఇన్‌చార్జి మనోజ్, దుబ్బాక సంజీవ్, శ్రీహరి పాల్గొన్నారు.

మహదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న సుగుణ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ(కె) గ్రామంలో హరహర మహదేవ్ శివాయంలో కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, మథుర కులపెద్దలతో కలిసి జాతరలో కలియతిరిగారు. జాతర సందర్భంగా నిర్వహించే ఆటల పోటీలను తిలకించారు. ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

కనీస సౌకర్యాలు ఏవి?



రాయిల్‌కోరి జంగుబాయి క్షేత్రం

- నేటి నుంచి జంగుబాయి జాతర
- తాగునీటికి తిప్పలే
- రాళ్లు, ముళ్లబాటే దిక్కు
- పట్టించుకోని అధికారులు

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ ఆధ్యాత్మిక ఉత్సవంగా గుర్తింపు పొందిన జంగుబాయి జాతరను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పుష్యమాసం జనవరి 13 నుంచి ప్రారంభమై నెల పాటు కొనసాగే వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. కాని ఇక్కడ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఈ క్షేత్రానికి వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. తాగేందుకు మంచి నీళ్లు కూడా దొరకని పరిస్థితి. దీంతో భక్తులు ఇబ్బందులు తప్పవు.

సహ్యాద్రి కొండల్లో..

బజార్‌హత్నూర్ మండలంలోని గిరిజాయి గ్రా మ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో సహ్యాద్రి శ్రేణుల నడుమ జంగుబాయి క్షేత్రం ఉంది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఆలయంపై ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. గిరిజాయి కొండకు అటువైపు మహారాష్ట్ర, ఇటువైపు తెలంగాణ ఉన్నప్పటికీ ఆలయం మాత్రం తెలంగాణ భూభాగంలోనే ఉంది. పుష్యమాసంలో ప్రారంభమై, నెల పాటు కొనసాగే జాతరకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఆదివాసీ భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

తీవ్ర నీటి ఎద్దడి..

జంగుబాయి సన్నిధిలో నీటి ఎద్దడి తీవ్రమైంది. ఈ ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురువక ఇక్కడ కడెం వాగు (ఇక్కడే కడెం నది పుట్టిన ప్రదేశం) ఎండి పోయింది. దీంతో భక్తులు రెండు కిలోమీటర్ల దూరంలోని గిరిజాయి గ్రామ సమీపంలోని పొలం బావి నుంచి ఎడ్ల బండ్లపై డ్రమ్ములతో నీటిని తెచ్చుకునే పరిస్థితి. జంగుబాయి దర్శనానికి ముందు గిరిజన సంప్రదాయం ప్రకారం కడెం వాగు నీటితో కాళ్లు శుభ్రం చేసుకోవడం ఆనవాయితీ. కానీ కడెం వాగులో నీళ్లు లేకపోవడంతో ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



జంగుబాయి దేవస్థానం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. భూతాయి గ్రామం నుంచి ఇంద్రనగర్, గిరిజాయి మీదుగా రాయల్‌కోరి వరకు రోడ్డు వేయాలి. రాయల్‌కోరి ప్రాంతంలో మిషన్ భగీరథ ద్వారా పైప్‌లైన్ వేసి తాగునీరు సౌకర్యం, సత్రాలు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– కుమ్ర సంగీత, మాజీ సర్పంచ్ గిరిజాయి

నిధులు కేటాయించాలి



జంగుబాయి ఆలయ అభివృద్ధి కోసం అధికారులు చొరవ చూపి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలి. దేవాదాయ శాఖ ద్వారా ఈ ప్రాంతంలో తాగునీరు, భక్తులు ఉండేందుకు సత్రాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. భూతాయి నుంచి క్షేత్రం వరకు బీటి రోడ్డు, ఘాట్స్ నిర్మించాలి.

– మడవి రాధ, మాజీ సర్పంచ్ భూతాయి(కే)

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామానికి ఉన్న మట్టిరోడ్డు వర్షాలతో పూర్తిగా అధ్వాన్నంగా మారింది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మట్టిరోడ్డును బాగుచేసి బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇటీవల గ్రామస్తులు కోరారు. గుబిడి రోడ్డు తాత్కాలిక మరమ్మతుల కోసం ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899